సూక్తులు

# సుందర మందారాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

“ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్” ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ఇంటర్నెట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. సేకరణ కర్త పేరు మాకు తెలియరాలేదు, అయినా వారు మంచి సేవ చేసారు కావున ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
2) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
3) మొబైల్ ఆప్: Free Gurukul


గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో ఇంటర్నెట్ నుంచి సేకరించి ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

“ మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి “


ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు




# సుందర మందారాలు



సుందర మందారాలు
స్వామి సుందర చైతన్యానంద
కాపీలు: 10,000
(సర్వ స్వామ్యములు ట్రస్ట్‌వి)
ప్రతులకు :
సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్,
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్-500 043.
☎:(040) 3093999,
(08418) 55777

స్వామి సుందర చైతన్యానంద



# మందార మాల

రాతలు తలల నుండే కదుల్తాయి. కొన్ని రాతలు తలలను కదుపుతాయి. కుదుపుతాయి.

పొదుపుగా కొన్ని పద సుమాలతో ఉక్తులు అవుతాయి. స్ఫూర్తి పరిమళాలను తోడు చేసుకొని సూక్తులవుతాయి. మనసులో విరబూసిన వివేక మందారాలే సూక్తులు. అందమైన భావ జగత్తులో సుందరముగా చలించే మందారాలు. సుందర మందారాలు.

"నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు"

అని గుండెలను కరిగించలేని రాతి బండలను ఒక కవి విసిరివేస్తే,
"గంగి గోవు పాలు గెరిటెడైనను చాలు" అని హృదయంలో అమృత బిందువులను చిందించే రస గుళికలను మరొక కవి ఏరి దాచుకున్నాడు.

మనసులో రణం లేకుండా జీవించుటకు మరణం లేని మాటలను మందార మాలగా తీర్చిదిద్దిన సుందర పాత్రము ఈ "సుందర మందారాలు" పుస్తకము.

అప్పుడప్పుడు, అలా అలా నా మనసులో కులికినవి, వేదికలపై నేను పలికినవి ఈ



పుస్తకంలో సూక్తులుగా ఉన్నాయి.

రెండు దశాబ్దాలుగా ఎన్నో జేబులను, చేతి సంచులను అలంకరిస్తూ, అలరిస్తూ వచ్చిన ఈ పుస్తకం ఇటీవల చాలా కాలంగా పునర్ముద్రణకు నోచుకోలేదు.

ఇందులో ఉన్నవన్నీ పలుకులే అయినా గొప్ప పలుకుబడిని సంపాదించాయి. సుమారు యాభై వేల ప్రతులు ఊరేగాయి. ఊరూరా తిరిగాయి. నోరార పలికాయి.

భక్తుల ఒత్తిడి మరీ ఎక్కువైంది. పునర్ముద్రణము తక్షణ కర్తవ్యమైంది. చేస్తున్నాము. అయితే, నూతన సూక్తులను

ఎన్నో జోడించాము. అందమైన ఈ మందారాలను గ్రుచ్చి ఈ సుందర మందార మాలను శ్యామ సుందరుని చరణ కమలాల వద్ద సమర్పిస్తున్నాము.

ఆశ్రమం<br>
హైదరాబాద్ ప్రణవ ప్రేమలతో<br>
12-12-2001 స్వామి సుందర చైతన్యానంద



1. దీనులపై సానుభూతి చూపటము మానవత్వము. ఆదుకొని రక్షించటము దైవత్వము.

2. జయము కలిగిందని పొంగిపోవటము కూడా అపజయమే.

3. ప్రపంచ భారాన్నంతా భగవంతుడు మోసేటప్పుడు నీ ఒక్కడి భారం మాత్రం మోయలేడా? అనవసరంగా ఆందోళన చెందుతున్నావు.

4. మొగ్గ మొక్కను పట్టుకొని ఉంటే చాలు. ఒకనాడు అదే పువ్వై కూర్చుం టుంది. మనస్సు సదా ధ్యానంలో ఉంటే మనిషి సదానందుడై శోభిస్తాడు. కోట్లాది పుష్పాలను వికసింపచేసే భగవానుడు నీ హృదయ పద్మాన్ని వికసింపచేయలేడా?

5. ప్రతి వ్యక్తిలో మానవుడు, మాధవుడు ఇద్దరూ ఉన్నారు. ఏడ్చి నపుడు మానవుడు తొంగి చూస్తాడు. నవ్వినపుడు మాధవుడు పొంగివస్తాడు.



6. విశ్రాంతి తీసుకొనే సమయము కూడా లేకుండా శ్రమించుటయే నిజమైన విశ్రాంతి.

7. వినోదం చేయి పట్టుకుంటే విషాదం ఆలింగనం చేసుకుంటుంది. అతి భాషణము అనర్థాన్ని తెచ్చిపెడు తుంది.

8. నావ ఎటు తిరుగుతున్నా దిక్సూచి ఉత్తర దిక్కునే చూపునట్లు దేహేంద్రి యాలు ఏ కర్మ లాచరిస్తున్నా మనసు భగవానుని యందు లగ్నం కావాలి.

9. ఆహ్వానించాలే గాని కష్టాలు ఆలస్యం చేయకుండా వస్తాయి. ఆహ్వానించటం మానుకో. కష్టాలతో కలిసి జీవించే శక్తి నీకు లేదు.

10. తప్పులు అందరూ చేస్తారు. అధములు చేసిన తప్పులే చేస్తారు.

11. బీజము తనను తాను భూమిలో నశింపచేసుకోవడం వల్లనే మహావృక్షంగా మారుతుంది. స్వార్థ త్యాగం జరిగినపుడే జీవితంలో మనం ఘన విజయాన్ని సాధించగలం.



12. సుఖాన్ని పొందటానికి యత్నించటం మంచిదే. కాని, దుఃఖం ఎదురైతే అనుభవించటానికి సిద్ధంగా ఉండటం నేర్చుకోవాలి. జీవితంలో సుఖాలే ఉంటాయని చెప్పలేము. అందిన దానిని ఆనందంగా అనుభవించటంలోనే ఔన్నత్యం దాగి ఉంది.

13. విజ్ఞానంతో అపరాధిగా బ్రతకటం కన్నా అజ్ఞానంతో నిరపరాధిగా జీవించటమే మంచిది.

14. గత స్మృతులు - భావి ఊహాలు, ఈ రెండు స్తంభాల మధ్యే జీవితం ఉరితీయబడుతోంది.

15. అజ్ఞానము అధికారము సాగించే చోట జ్ఞాని మూగవాడుగా మెలగటమే జ్ఞానము.

16. తనలో జన్మించిన ముత్యం గురించి సముద్రానికి ఎంత తక్కువ తెలుసో తనలో ఆవిర్భవించిన మహాత్ములను గురించి ప్రపంచానికి అంతే తెలుసు.



17. కత్తిరిస్తే పూల కంచెలు అందంగా తయారవుతాయి. విమర్శలు జీవితాన్ని అందంగా ప్రకాశింపచేస్తాయి.

18. పుణ్యాత్మునికి దివ్యమైన గతం ఉంటుంది. పాపికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుంది. పాపికి పుణ్యాత్మునికి మధ్య గల తేడా ఇదే.

19. అనవసరంగా మాట్లాడటం మానేసి వినటం అలవరచుకో. నీ నుండి పారలే నీ మాటలు నిన్ను చెవిటివాణ్ణి చేస్తాయి.

20. నీవు దేనిని ఎంతగా పొందియున్నావో, దాని చేత అంతగా బద్ధుడవై యున్నావు.

21. మమకారం తియ్యని విషం లాంటిది. అది నిలువునా ప్రాణాల్ని తోడేస్తుంది. మంచి చెడులను చూడదు. ద్రోణుడు మంచివాడు. ధృతరాష్ట్రుడు కాడు. కాని, పుత్ర వ్యామోహంతో ఇద్దరూ పాడైపోయారు.

22. పుచ్చుకొంటే భారం పెరుగుతుంది. ఇచ్చుకుంటే బరువు తగ్గుతుంది.



23. కలతల్లో కవితలు పుడుతాయి. గాయాలు గానాన్ని కదిలిస్తాయి. వెతలు వెలుగుల్ని ఆరబోస్తాయి. బాధలు బోధలవైపు నడిపిస్తాయి. అన్నీ మంచికే ఉన్నాయి.

24. ఆలోచించకూడని వాటిని ఆలోచిస్తూపోతే, ఒక దశలో మన ఆలోచనల్ని మనమే భరించలేని స్థితి వస్తుంది. విలువలేని వ్యక్తుల పలవరింతలకు, కలవరింతలకు విలువ కట్టడం ప్రయత్నిస్తే ఆ తరువాత మన జీవితమే విలువలేనిదిగా మారిపోతుంది.

25. ఇచ్చేందుకు వస్తువుల్ని, ఇచ్చే చేతుల్ని, ఇవ్వాలనే చిత్తాన్ని అన్నిటినీ పరమాత్మే మనకు అనుగ్రహించాడు. ఇవన్నీ, ప్రసాదాలే. వాటిని అలాగే . వినియోగించుకోవాలి. ఇదే సమర్పణము.

26. తన అజ్ఞానాన్ని గూర్చిన జ్ఞానం లేకపోవటమే అజ్ఞాని గొప్పతనానికి నిదర్శనం.

27. ఆశించటమే గాక అర్హతను పొందటం వలన దేనినైనా సాధించగలము.



28. మనిషికి దుఃఖం రెండు విధాలుగా వస్తుంది. ఒకటి తాను కోరింది సాధించలేకపోవటము వలన.......... రెండవది తాను కోరింది సాధించటము వలన.

29. కుండలు వేరైనా మన్నొక్కటే. సొమ్ములు వేరైనా బంగార మొక్కటే. ఆవులు వేరైనా పాలొక్కటే. శరీరాలు వేరైనా ఆత్మ ఒక్కటే.

30. కోరికలు తీర్చుకోవటం కాక కోరికలు లేకుండా చేసుకోవటంలో మనిషి సుఖపడతాడు.

31. నీవు చిన్నవాడివైతే ప్రపంచము చాలా పెద్దది. నీవు పెరిగావా, ప్రపంచము చాలా చిన్నదైపోతుంది.

32. పరిస్థితులు మనిషి అధీనంలో ఉండవు. కాని, ప్రవర్తన తన అధీనమే.

33. దీపము చీకటిలో వెలుగుతుంది. నీవు వెలుగులో వెలుగుతావు. అందుకనే నీవు దీపాన్ని వెలిగిస్తావు.

34. దీర్ఘ జీవితము ధన్య జీవితము కాకపోవచ్చు. కాని, ధన్య జీవితము స్వల్పమైనా దీర్ఘ జీవితమే.



35. సంకల్పాలను ఆరంభించటం అందరూ చేస్తారు. వాటిని ఆపటం కొందరే చేయగలరు.

36. అందమైనది ఆదర్శవంతము కాకపోవచ్చు. ఆదర్శమైనది సదా అందంగానే ఉంటుంది.

37. పరమానంద ప్రాప్తికి పవిత్రతయే ప్రథమ సోపానము.

38. స్వప్నంలో కలిగిన కష్టాన్ని, నష్టాన్ని తొలగించుకోవాలంటే మేలుకొనుటే ఏకైక పరిష్కారము.

39. పక్షి గగనాన విహరించిన పిదప తన జాడలు ఎలా మిగలవో, మనస్సు లో ఆలోచనలు నడచిన తరువాత అవి మనస్సులో తిష్టవేయకుండా ఉంటే అతడే స్థితప్రజ్ఞుడు.

40. నేరస్థుణ్ణి మనస్సు శిక్షించినంతగా చట్టం శిక్షించలేదు.

41. 'మానవ సేవయే మాధవ సేవ' అనిన వారిలో ఎక్కువ శాతం ప్రపంచంలో సమస్యలే సృష్టించారు. సేవలో మాధవుని చూడగలిగినవారే నిజమైన మానవ సేవ చేశారు.



42. ప్రేమను పొంది ద్వేషాన్ని పంచే జీవులు పాలు త్రాగి విషము గ్రక్కే కోడెత్రాచుల వంటివారు.

43. దీపమును దర్శించుటకు మరి యొక దీపము అవసరం లేదు. జ్ఞానస్వరూపమైన ఆత్మను దర్శించుటకు మరియొక జ్ఞానము అవసరం లేదు.

44. ఒక ఇనుప ముక్కతో మరొక ఇనుప ముక్కను సరిచేయునట్లు శుద్ధ మనస్సు అశుద్ధ మనస్సును సరి చేస్తుంది.

45. ఆకు రాలినంత మాత్రాన చెట్టు నశిస్తుందా? దేహము గతించినంత మాత్రాన ఆత్మ నశిస్తుందా?

46. ఎండమావులలోని నీటి వలన ఎడారి తడవనట్లు, మనోబుద్ధులలోని భ్రాంతి ఆత్మను అంటదు.

47. భక్తి అనేది ఒక మహాసముద్రము. దాని లోతు ఇప్పటికీ ఎవ్వరికీ అంతు పట్టలేదు. అయినను ఆ సముద్రంలో మునిగినవాడు ఇంతవరకు ఎవ్వడూ ప్రాణాలు పోగొట్టుకోలేదు.



48. మంచి గంధపు చెక్క అయినా, కొంతకాలం అలాగే నీటిలో ఉంచితే దుర్గంధాన్ని వెదజల్లుతుంది. మనిషి మంచివాడే అయినా దుర్జనుల మధ్య అదే పనిగా చరిస్తూ ఉంటే క్రమేపి మంచితనాన్ని పోగొట్టుకోవటమే గాక, చెడు మార్గానికి అలవాటుపడతాడు.

49. ధనము లేకపోతే దారిద్ర్యము బాధిస్తుంది. ధనముంటే ఆశ పీడిస్తుంది. ధనమున్నా దుఃఖమే. లేకపోయినా దుఃఖమే. ధనమెలా క్షేమకరమో ఆలోచించగలిగినపుడే ధనం దగా చేయకుండా ఉంటుంది.

50. పంచదారలో తియ్యదన మున్నట్లు ప్రతి ప్రాణిలో పరమాత్మ ఉన్నాడు.

51. పర్వతాలు పిండిగా మారిపో యాయి. సాగరాలు ఆవిరై పోయాయి. సుందరమైన వనాలు అందమైన పట్ట ణాలు భూగర్భంలో కలిసిపో యాయి. ఉప్పొంగిన వరదలతో భూమాత ఒంపు సొంపులే మారిపోయాయి. పరిణామ శీలమైన ఈ జగత్తును ఆనంద నిలయంగా భావించే మాన వుడు నీళ్ళు లేని బావిలో గంతులేసే కప్పలాంటి వాడు.



52. పూర్ణత్వంలో వ్యక్తిత్వమూ లేదు, అనేకత్వమూ లేదు. పూర్ణత్వ మనేది దివ్యానుభూతిలో శోభించే ఏకత్వమే.

53. తూటు పడకముందే నావ తీరాన్ని చేరాలి. దేహం పాలిపోక ముందే జీవితం ముక్తికాంత ఒడిలో వాలిపో వాలి.

54. ఈ ప్రపంచ చదరంగంలో శకుని పాచికలే కదులుతున్నాయి. జాగ్రత్త! తొందరపడి కాలు పెట్టావా? ఆ తరువాత ఖాళీ చేతులతో కదలిపో వాలి.

55. గింజ పట్టిన కంకి వంగుతుంది. జ్ఞానం కలిగిన వ్యక్తి వినమ్రుడై ఉంటాడు.

56. తన మనుగడకు, మహిమకు కారణమైన తోటమాలికి పువ్వులను, కాయలను, ఆకులను, ఫలములను సమర్పించుకొను తరువులాగా మన జీవిత వైభవానికి కారణమైన పర మాత్మకు సర్వాన్ని సంపూర్ణంగా సమ ర్పించుకొని తరించాలి.

57. గురుసన్నిధిలో కదిలేది భక్తి. గురు సందేశములో కలిగేది ముక్తి.



58. అహంకారులైన విద్యావంతుల కన్నా నిరహంకారులైన విద్యాహీనులే నయం.

59. ఎండమావులలోని జలం ఇంత వరకు ఏ ఒక్కరి దాహాన్ని తీర్చలేదు. ప్రపంచంలోని విషయసుఖాలు ఈనా టికి ఏ మానవునికి శాశ్వత సుఖాన్ని అందించలేదు.

60. తాను సన్యాసినని భావించినంత వరకు సన్యాసి సన్యాసి కాలేడు. తాను సంసారినని భావించకపోతే సంసారి సన్యాసియే.

61. చచ్చిన వానిని గూర్చి బ్రతికిన వాడు దుఃఖిస్తాడు. మనలో బ్రతికి యున్న దెవరు? అహంకారము. దానిని చంపేస్తే, ఆ తరువాత దుఃఖించే అవసరమే ఉండదు.

62. నీ కృషిలో సాధించలేనిది గురు కృపతో నీకు సాధ్యమవుతుంది.

63. క్రోధాన్ని పోగొట్టుకోవటంకన్నా క్రోధ మెవరి స్వభావమో ఆలోచించ గలిగితే ఆ తరువాత మన దారికి అడ్డు రాకుండా క్రోధము తన దారిన తాను పోతుంది.



64. నిద్రకు భయపడని నీవు మృత్యు వుకు భయపడతా వెందుకు? నిద్ర తాత్కాలిక మృత్యువైతే, మృత్యువు దీర్ఘ నిద్రే కదా?

65. భగవానుని మరపించే భోగాల కన్నా, పరమాత్మను స్మృతికి తెచ్చే బాధలే శ్రేయస్కరము.

66. ఆవేశానికి ఆకృతి ఇవ్వటంలోనే ఉంది జగత్తు యొక్క విశేషం. ఆవేశా లంతరించిన వ్యక్తికి ~~ఈ~~ ప్రపంచమొక శ్మశానమే.

67. అందము వ్యక్తికి సంబంధించింది కాదు, ఊహకు సంబంధించింది. దుఃఖము జీవిలో లేదు, అవగాహనలో ఉంది. బలహీనత మనిషిలో లేదు, మతిలో ఉంది.

68. అధిక భోజనము ఆయాసమును, అనారోగ్యమును అందిస్తుంది. అల్ప భోజనము నీరసమును అశక్తతను కలిగిస్తుంది. మిత భోజనము ఆరోగ్యమును, ఆనందమును ప్రసాదిస్తుంది.

69. ధనం అజ్ఞానిని శాసిస్తుంది. జ్ఞానికి సేవ చేస్తుంది.



70. కారాగారంలో ఉన్నవాడు శారీరకంగా ఖైది. కోరికల మధ్య యున్నవాడు మానసిక ఖైది.

71. నిరంతరము భగవద్భక్తి చేయడమంటే మనలోని బలహీనతలను అధిగమించడమని భావము.

72. నవ్వటం మరచిపోయినవాడు నిరాశావాది. మరచిపోవటానికి నవ్వేవాడు ఆశావాది.

73. వేదాంతి అంటే ఎవరో కాదు; వేద పురుషునిలా జీవించేవాడు.

74. నీటితో శరీరము శుభ్ర పడుతుంది. మనస్సు సత్యముచే శుద్ధి పడుతుంది. జీవుడు తపస్సు చేత నిర్మలు డవుతాడు. బుద్ధి జ్ఞానంతో శుద్ధి పడుతుంది.

75. ఆత్మీయు లెవరో తెలుసుకోవటానికే ఆపద లొస్తాయి. అపోహలు, అపనిందలు నీ జీవన శిల్పానికి తుది రూప మిచ్చే కళాకాంతులు.

76. మనం పుట్టింది మళ్ళీ పుట్టకుండా ఉండటానికి. మరణించేది మళ్ళీ మరణించకుండా ఉండటానికి.



77. ప్రపంచమే సత్యమని భావించు వాడు కల్పవృక్షము క్రింద ఉన్నను కృశిస్తూనే ఉంటాడు. పరమాత్మే సత్యమని భావించువాడు కౌపీన వంతుడైనను భాగ్యవంతుడై శోభిస్తూ ఉంటాడు.

78. తన ఆలోచనలను ఇతరుల ముందు ఉంచేవాడు గాక ఇతరుల ఆలోచనలు కదిలించువాడే నిజమైన ప్రబోధకుడు.

79. ధర్మ నిర్వహణలో దైవ సహాయ ముంది.

80. ప్రబోధకుడివి కావాలా? అయితే దానికి ఒక్కటే మార్గం. నిన్ను నీవు ఉద్ధరించుకో.

81. మంచివాడికి మంచి గత ముంది. చెడ్డవాడు భవిష్యత్తులో మంచి వాడవు తాడు. అందరూ ఏదో ఓనాడు మంచి వాళ్ళే అవుతారు. మహాత్ములే అవు తారు.

82. జరిగేవాటిని నీవు ఆపలేవు. జరుగ వలసిన వాటిని నీవు ఆరంభించగలవు.



83. వెతలే జీవితానికి వెలుగు బాటను చూపించే దివిటీలు.

84. అహంకారాన్ని ప్రక్కకు నెట్టి నీ ద్వారా పని చేసే అవకాశాన్ని పరమాత్మ కివ్వు.

85. వాంఛలను తీర్చమని అర్థించేవాని కన్నా, భక్తిని పెంచమని, ముక్తిని ప్రసా దించమని ప్రార్థించేవానికే పరమాత్మ కృప లభిస్తుంది.

86. ప్రపంచం మారలేదని గగ్గోలు పెట్టకు. నీ వెంత మారావో పరీక్షించి తెలుసుకో.

87. నామము ప్రేమను చిందిస్తుంది. ప్రేమ భగవంతుని అందిస్తుంది.

88. కూలికి పని చేయడం, కూలి ఇచ్చి పని చేయించుకోవడంలోనే బ్రతుకులు కూలిపోతున్నాయి. ప్రేమతో పనిచేయడం, డబ్బుతో పాటు ప్రేమను కూడా పంచడంలోనే జీవితాలు శోభిస్తాయి. సమాజము అభ్యుదయాన్ని చూస్తుంది.

89. ఉపన్యసించే వారికి ధర్మం తెలుసు. ఉపదేశించేవారికి ధర్మ రహస్యం తెలుసు.



90. గోవులలో పాలూ ఉన్నాయి. రక్తమూ ఉంది. మనిషికి పాలే కావాలి. దోమకు రక్తమే కావాలి. సంస్కారమే సంపాదన.

91. మితిమీరిన వినోదం మతి భరించలేని విషాదాన్ని పంచుతుంది. అతి భాషణము అనర్థాన్ని తెచ్చిపెడు తుంది.

92. పుప్పొడి రాలకుండా తుమ్మెద తేనెను గ్రోలుతుంది. నొప్పించకుండా ఇతరులతో మనం మెలగాలి.

93. ఈ ప్రపంచంలో ఎవరి ఆటలు వారు ఆడుతున్నారు. ఆ వికారాలను చూసి మన ఆకారాలను ఎందుకు పోగొట్టుకోవాలి? విచిత్రమైన ఈ ప్రపంచంలో వికారాలు కూడా ఆకారాలే.

94. నీలో కదిలే ప్రతి బాధా తరంగము నీ స్వరూపమైన ఆనంద సాగరాన్ని నీకు గుర్తు తెస్తుంది. ప్రతి చావు నీకు అమృతత్వాన్ని ప్రబోధిస్తుంది. ప్రతి బంధము నీకు మోక్షాన్ని గూర్చి తెలుపు తుంది. నీ నేత్రాల నుండి



జాలువారే కన్నీరు నీలో పన్నీటి వర్షం కురిపించేందుకే నని అవగత మవుతుంది. అర్థం చేసుకొనే మనసుండాలే గాని అనుక్షణం సందేశాలే అందుతాయి.

95. చీకటిలో వెలిగేది దీపం. చీకటి లోనే గాక వెలుగులో కూడా వెలిగే నీవు జ్ఞానదీపం.

96. నీవు సత్య స్వరూపుడుగా పుట్ట లేదు. సత్యాన్వేషిగా పుట్టావు. ఆ పని చేయటంలోనే సత్యరూపుడవై శోభిస్తావు.

97. ఔషధం జీవితాన్ని పొడిగించ వచ్చు. చావు వైద్యుని కూడా విడిచి పెట్టదు.

98. చీకటి వెలుగులు ప్రకృతిని వీడవు. సుఖదుఃఖాలు మనిషిని వదలవు.

99. విధి కాదెన్నడూ నీకు నిధి. అదృష్ట మనే దొక చీకటి గది. "విధి"ని విడి పోనీ. అదృష్టాన్ని మాడిపోనీ. అర్థ తలే ఏనాడైనా అందల మెక్కుతాయి. అవగాహనలే గొడుగులు పట్టించు కుంటాయి.



100. 'అవధి' చూపేవాడు గురువు. అవరోధమును దాటేవాడు శిష్యుడు. అధిగమించే దశలో కష్టమంతా శిష్యు నిదే. కరుణంతా గురువుదే.

101. 'నాది-నేను' అనేవి రెండు. ఇవే దుఃఖ కారణాలు అనే సత్యం మాత్రం ఒక్కటే.

102. పెళ్ళి పీటల మీద ఇద్దరు ఒక్క టిగా కూర్చుంటే కళ్యాణం. మనిషి హృదయంలో రెండు ఒక్కటిగ మారితే వ్యక్తి కళ్యాణం. అదే లోక కళ్యాణం.

**103.** దగ్గరై బాధించేది ద్వేషము. దూరమై బాధించేది రాగము. ఈ రెండిటి మధ్య దొర్లిపోయే బ్రతుకు చెండుకు అడుగడుగునా దెబ్బలే. ప్రతి అడుగులో మడుగులే. ద్వంద్వాల స్థితి అంతే. వాటిని నమ్ముకున్న బ్రతుకుల పరిస్థితీ అంతే.

**104.** గాలి నిచ్చేది తరువు. జాలి చూపేది గురువు. ఆశించదు దేనిని తరువు. ఆశ తెరుగని వాడు గురువు. ఎండుతూ నీడ నిస్తుంది తరువు. శ్రమిస్తూ సుఖాన్ని పంచేవాడు గురువు.



**105.** చేత కాలేదని చింతించకు. చేయూత నిమ్మని పరమాత్మను ప్రార్థించు. వేదనలకు స్వస్తి చెప్పు. బ్రతుకును నివేదనగా మార్చుకో.

**106.** కాలాన్ని వాడుకోవాలే గాని కాలంతో ఆడుకోకూడదు. వాడుకలోనే ఉంది వేడుక.

**107.** కొందరు తిడుతూ పెడుతుంటారు. కొందరు పెడుతూ తిడుతుంటారు. ప్రేమ లేని కానుకలు ఎవ్వరికీ రుచించవు. ప్రేమయే నిజమైన కానుక.

**108.** చిత్రకారుడు వికృతంగా కనిపించే దారుణమైన బొమ్మను గీసాడు. చాలా ఘోరంగా ఉంది. ఉండనీ. ఏమైంది? అది బొమ్మేనని నీకు తెలుసు. అనిత్య మని తెలుసు. బొమ్మ భయంకరంగా ఉన్నా చిత్రకారుని కౌశల్యానికి మనం ముగ్ధులౌతున్నాం.

**109.** దోమలు లేనిచోట ప్రశాంతంగా నిద్రించవచ్చు. దొంగలు లేనిచోట హాయిగా జీవించవచ్చు. దోషాలు లేకపోతే ప్రతి హృదయము పాల సముద్రమే. ప్రతి వ్యక్తీ శాంతాకారమే.



**110.** కోరికలు కదలనంత వరకు అందరూ భాగ్యవంతులే. కోరికలు కదలిన క్షణాన అందరూ బిచ్చగాళ్ళే. సంపద లున్నవారు ఎందుకని సంపన్నంగా జీవించలేకపోతున్నారు? వారికి డబ్బు ఉంది; బంగళాలున్నాయి. కార్లు ఉన్నాయి. ఖాతా లున్నాయి. అన్నీ ఉన్నాయి, వాటితో పాటు కోరికలూ ఉన్నాయి.

**111.** చెట్లను పెంచేది ఎరువు. శిష్యుల్ని పెంచేది గురువు. అవని లోపలే ఎరువు. అవలోకిస్తేనే గురువు.

**112.** క్షణంలో గండం - నిముషంలో మరణం; ఇదీ ప్రపంచంలో చదరంగం. క్షణం కూడా వృథా గాకుండా కాలాన్ని వినియోగించుకోవడమే తక్షణ కర్తవ్యం.

**113.** అందరినీ ప్రేమించు. ప్రేమించ లేని నిర్భాగ్యులను క్షమించు. నీ వెవరినీ బాధించకు. బాధించేవారి వలలో పడకు. మిత్రత్వము దైవ లక్షణం. శత్రుత్వము అసుర జీవనం.

**114.** రెండున్న చోట తప్పవు గండాలు. అవే బ్రతుకులో సుడిగుండాలు.



**115.** "తండ్రీ! నా పాపాలు కష్టాల్ని అందిస్తే, నీ కృప కన్నీళ్ళను ప్రసాది స్తుంది. కష్టాల్ని తలచుకొని దుఃఖించడం కన్నా కన్నీళ్ళతో నీ పాదాలను కడిగి తృప్తి చెందే భాగ్యం కలిగినందుకు పొంగిపోతున్నాను. కన్నీ ళ్ళున్నది ఇందుకే నని ఇప్పుడే తెలి సింది".

**116.** చెత్తను కుండీలో పారవేసినట్లు దేహాన్ని ఒకనాడు శ్మశానంలో విసిరి వేయాలి. దేనికి అహంకారం? దేనిపై మమకారం?

**117.** విత్తన మేదైతే చెట్టు అదే వస్తుంది. మనసు దేనిని ఆలోచిస్తుందో మనిషి అలాగే తయారవుతాడు. ధ్వనిని బట్టే ప్రతిధ్వని.

**118.** ఇతరులు ఎలా ఉండాలని భావిస్తున్నావో నీవు అలా ఉన్నావా? నీవు సుఖపడు. ఆ సుఖం ఇతరులకు కూడా ఉండాలని భావించు. నీ దుఃఖాన్ని ఇతరులు పంచుకోవాలి. మరి, వారి దుఃఖాన్ని నీవు పంచుకోగలవా? నీ నుండి ఏది కదుల్తుందో అదే నీకు కలుగుతుంది. పట్టుదలతో జీవించు. పట్టువిడుపులు తెలిసి చరించు.



**119.** పంట నంటి యున్న కలుపు పంటనే పాడుచేస్తుంది. మనస్సులోని ద్వేషం మనిషి మనుగడనే పాడు చేస్తుంది.

**120.** దీపా లన్నిటిలో చమురు ఉన్నట్లు భక్తు లందరిలో భక్తి ఉంటుంది. దీపాలలోని వత్తులలో తేడా లున్నట్లు, భక్తులలోని శ్రద్ధలో వ్యత్యాసా లుంటాయి. భక్తి యున్న వారందరూ భగవంతుని ఆరాధిస్తారు. కాని, భక్తితో పాటు శ్రద్ధ గలిగినవారు భగవంతుని అనుగ్రహాన్ని పొందుతారు.

**121.** కాశికి వెళ్ళటం మంచిదే. కానీ, చంకన పిల్లిని ఉంచుకోవడం అంత మంచిది కాదు. కాశికి వెళ్ళటానికి పిల్లి అంతరాయం కాదు. కాని, విశ్వనాథుని దర్శించాలంటే గొప్ప అవరోధమే.

**122.** నీకు అన్నీ తెలుసు. పాపం! నిన్ను గురించి మాత్రమే నీకు తెలియదు. అంతే. ఇప్పటికీ అంతే. బ్రతుకంతా అంతే అయితే, ఇక జీవితములో మిగిలేది చింతే.



**123.** దూరపు కొండలు నునుపుగా ఉంటాయి. సమీపిస్తే అన్నీ రాళ్ళ గుట్టలే. చెట్ల గుంపులే. కొందరు దూరంగా ఉండి ఆకర్షిస్తారు. దగ్గరై ప్రాణాలు పిండుతారు.

**124.** కడలి స్నానానికి కెరటాలు అడ్డురావు. స్ఫూర్తితో జీవించేందుకు కష్టాలు అడ్డు నిలవవు. అర్థం చేసుకొనే నేర్పుంటే, జీవన నౌకకు తెడ్డులా సహకరిస్తాయి. గడ్డను తొలగిస్తాయి. ఒడ్డుకు నడిపిస్తాయి.

125. సంగీతం నేర్చుకున్నాము. దేనికి? రాగాలాపన చేసేందుకే కదా? చక్కగా పాడుకొనేందుకే కదా? వ్యక్తం గాని మూగస్వరాలు ఎవరిని తృప్తి పరుస్తాయి.

126. 'గతం గతః' - గతం గతించింది అంటూ ఉంటారు. ఇది నిజమా? ఇదే వాస్తవమైతే బ్రతుకు పూలబాటయై నిలుస్తుంది. గతం గతించలేదు. అది పొయ్యిలో పడి కాలిపోలేదు. నుయ్యి లో పడి మునిగిపోలేదు. మనస్సులో ఊరేగుతూనే ఉంది. బుద్ధిలో తేలుతూనే ఉంది. క్రొత్త చింతకాయ



లొచ్చినా పాత పచ్చడే ఊరేగుతోంది. ఎన్నో పుస్తకాలు చదివాము, ప్రవచ నాలు ఆలకించాము, మరెన్నో సాధనలు నేర్చుకున్నాము. దేనికి ఇవన్నీ? ఆచరించేటందుకే కదా? ఆచరణ లేని జీవికి అనుభవ మెలా ప్రాప్తిస్తుంది? చలనము లేని బ్రతుకుకు మిగిలేది మరణమే.

127. నీ వద్దకు వచ్చేవా రెవరైనా కృష్ణుడే. నీవు వెళ్ళే చోటు ఏదైనా బృందావనమే. ధ్యానమంటే ఏదో కాదు. ప్రేమను కురిపించే నిర్మల దృష్టియే.

**128.** బట్టలు వంద జతలున్నా, మనిషి ధరించేది జత బట్టలే. పది బస్తాల బియ్యం ఇంట్లో ఉన్నా, పూటకు కావలసింది పొట్టకి పది పిడికిళ్ళే. పది భవనా లుండొచ్చు. కాని, మనిషి వసించేది ఒక్క భవనంలోనే. వెండి కంచాలు దండిగా పడి ఉన్నా తినవలసింది ఒక్క పాత్రలోనే. పడకలు పది ఉన్నాయి, కాని పడుకొనేది ఒక్క దానిపైనే. అది కూడా కొంత స్థలంలోనే. ఈ మాత్రానికి క్షణక్షణమూ ధన జపమే.



**129.** మతి చెప్పినట్లు ఊగేవాడు మనిషి. శ్రుతి చెప్పినట్లు సాగేవాడు మహర్షి. మతికి ఒక నియతి అంటూ ఉండదు. అంతా లేడి పరుగే. చివరికి అంతా కనుమరుగే.

**130.** ఆపదలు అభివృద్ధికి పునాదులు. బాధలే బ్రతుకును తీర్చిదిద్దే బోధలు. నేటి వెతలే భవిష్యత్తులో వెలుగుల తోరణాలు. ప్రతికూల పరిస్థితులను కూడా అవగాహనతో అనుకూలంగా మార్చుకొనువారే ధన్య జీవులు.

131. చేదు పూల నుండి తియ్యని తేనెను చేదుకొనే తేనెటీగ లాగ మంచిని గాలించి పట్టుకోవాలి. బుద్ధిలో స్థిరంగా పెట్టుకోవాలి. అప్పుడే జీవితానికి అందం. జీవికి మకరందం.

132. గురువు నీ ముందు వ్యక్తిగా లేడు; విషయంగా ఉన్నాడు. తత్త్వంగా ఉన్నాడు. నీ ముందు గురువు ఉన్నది నీవు అతణ్ణి నీతో పోల్చుకొని అర్థం చేసుకొనేందుకు కాదు. అతడి బోధను గ్రహించి, ప్రమాణాన్ని స్వీకరించి నీవు అతడికన్నా భిన్నమైన వాడివి కాదని తెలుసుకొనేందుకే.



133. చూడు నాయనా! కాయకు చెట్టు ఆధారం గాని కాయకు మరొక కాయ ఆధారమా? అన్యుల నాశ్రయించి ఇంతవరకు ఏమి సాధించావు? ఇక ముందు ఏమి సాధించబోతావు? నిలకడగా ఆలోచించు. నిలబెట్టిన వానిని ఆశ్రయించు.

134. బాల్యం పువ్వులాంటి దైతే యౌవనం కాయ లాంటిది. ఈ రెండు దశల్లో జాగ్రత్త పడకుంటే ఫల రూపం నిష్ఫలమే.

**135.** సంస్కార ముంటే సంపదలు లేకపోయినా జీవితం సంతృప్తిగా సాగుతుంది. సంపద లుండి సంస్కారం శూన్యమైతే బ్రతుకు కాలి పోతుంది. మాడిపోతుంది. మసై పోతుంది.

**136.** పెట్టుకొంటే అన్నీ సంబంధాలే. పట్టుకొంటే అందరూ బంధువులే. మేలుకొంటే కలలన్నీ కల్లలే. కదిలే కాలంలో కనుమరుగయ్యే బంధాలన్నిటిని ప్రయత్నించి మరచిపో.

**137.** ఉన్నదానిని ఎవ్వరూ ఇవ్వలేరు. ఒకవేళ ఇస్తే, ఉన్నది అనే జ్ఞానం ఇస్తారు. అదే మోక్షం.



**138.** హోరున గాలి వీచినా, జోరున వాన కురిసినా పర్వతం చలించదు. సమాజము మెచ్చుకున్నా, నొచ్చుకున్నా వేదాంతి చలించడు. నిందాస్తుతులు అతడిని తాకలేవు.

**139.** గాలికి వీచేవి మాకులు. గోల చేసేవి కాకులు. మాకుల్లాగ ఊగిపో నవసరం లేదు. కాకుల్లాగ ఊరేగ నవసరం లేదు. విమర్శలు ఎవరినీ విడిచిపెట్టవు. వాటిని పరామర్శిస్తూ పోతే నీవు ప్రగతిని సాధించలేవు. హంసలా జీవించడమే మన కర్తవ్యం. పరమహంసలా జీవించడమే మన ధర్మం.

**140.** ఏదో ఉండటం వల్ల దుఃఖం రాదు. ఏదో లేకపోవటం వల్ల దుఃఖం రాదు. ఉన్నవి, లేనివి రెండు దుఃఖ కారణాలు కావని తెలియక పోవటం వలన దుఃఖం పుట్టుకొస్తుంది.

**141.** విశ్వామిత్రుడు విశ్వానికి మిత్రుడు. ఆయన నిర్వహించిన యజ్ఞాలు లోక కళ్యాణాన్ని ఆవిష్కరించాయి. వాటిని పాడు చేయాలని రాక్షసులు చేయరాని పనులు చేశారు. విశ్వామిత్రునికి రాముని అండ ఉంది. రాక్షసులు నశించిపోయారు.



**142.** ఉన్నవాళ్ళూ అనుభవిస్తారు. లేని వాళ్ళూ అనుభవిస్తారు. గురువు ఉన్న వాళ్ళు అనుభవించేది సుఖం. గురువు లేనివాళ్ళు అనుభవించేది దుఃఖం.

**143.** ఈ ప్రపంచంలో ప్రతి మనిషిదీ జాలి బ్రతుకు. గాలి బ్రతుకు. చెట్టు పై వాలిన పక్షి ఎంతసేపు ఉంటుంది? దేహంలో నడయాడే గాలి ఎంత కాల ముంటుంది? గాలి ఉన్నంతవరకే ఈ బ్రతుకు. అందుకే ఇది గాలి బ్రతుకు. ఈ సత్యం తెలిసి కూడా గాలిమేడలు కట్టుకొనే బ్రతుకులు జాలి బ్రతుకులు కావా?

144. రాగమున్న చోటికి పరుగులు తీస్తాం. ద్వేషమున్న చోటు నుండి దౌడు తీస్తాం. రాగద్వేషాలను విడిచి పెడితే పరుగు తీయ నవసరం లేదు. ఎక్కడ కాలుపెట్టినా కాలుక్రింద పరుపులే ఉంటాయి. ప్రపంచం నేడున్న దానికన్నా నాలుగు రెట్లు విశాల మవుతుంది.

145. జీవితంలో అపజయాలు అవరోధాలు కావు. అపజయాలను అంగీకరించలేని మానసిక దుస్థితియే బ్రతుకు బాటలో గొప్ప అవరోధంగా నిలుస్తుంది.



146. మన ఆలోచనలు ధర్మబద్ధంగా ఉండాలి. తినినా, వినినా, అనినా, కనినా, కన్ను మూసినా, కర్మ చేసినా - అన్నీ మితంగా, హితంగా ఉండాలి. అప్పుడే మనుగడలో కాంతి. మనసుకు శాంతి.

147. చల్లనివాడివి కా! బురద చల్లని వాడివి కా! చల్లనివాడివి కా! ప్రేమ సుధలు చల్లెడి వాడివి కా! పిండిలో పంచదార లోపించినా ఫరవా లేదు. నీ పలుకులో తియ్యదనం లోపించ కూడదు.

148. తప్పు చేస్తే ఒప్పేసుకో. అంత టితో బాధ తప్పిపోతుంది. ఒప్పు చేస్తే కప్పేసుకో. అంతటితో అసూయ అంతరిస్తుంది.

149. మాట పడకూడదు. మాట నిల బడాలి. చల్లగా పిలువు. మెల్లగా పలుకు. నమ్మకం సొమ్ము కానీ. అనుమానం అంతరించనీ.

150. రాలినా పొగడలు పరిమళిస్తాయి. కాలినా కాగడాలు కాంతి నిస్తాయి. బాధలు బరువులు ఉంటే ఉండనీ. బోధలో హృదయాన్ని నిండుగా పండనీ.



151. రేకు లెన్నున్నా పువ్వు అద్వైతమే. కారణ మేదైనా నవ్వు అద్వైతమే. నే నని భ్రమించినా నీవూ అద్వైతమే. నువ్వని పలికినా నేనూ అద్వైతమే.

152. ఆయుర్దాయానికి వ్యయమే గాని ఆదాయం తెలియదు. నదిలో ముందుకు పోయిన నీరు వెనుకకు మరలిరాదు. గతించిన ఆయుష్షు వెనుదిరిగి రాదు.

153. గుడ్లగూబలు పగలు చూడలేవు. కాకులు రాత్రులు చూడలేవు. నీచుల దుష్టకార్యాలకు కాలంతో పనిలేదు.

154. పూచిన మల్లెలపై వీచే గాలులు సౌరభాన్ని దోచుకుంటాయి. దాచు కుంటాయి. ఎందుకో తెలుసా? నీకు దానం చేసేందుకు. మనస్సులో భావ మల్లెలు విరబూయాలి. ప్రేమ గాలులు జ్ఞాన సౌరభాన్ని వెదజల్లాలి.

155. తండ్రి మనస్సు తల్లికి రాదు. తల్లి హృదయం తండ్రికి ఉండదు. కాని, ఈ రెండూ ఆచార్యునికి ఉంటాయి. అందుకే **"ఆచార్య దేవో భవ!"** గురువు నీకు దేవుడు అగు గాక! అని వేదమాత ఆశీర్వదించింది.



156. అడిగేవాడు ఎవరికైనా అలుసే. అర్థించేవాణ్ణి వ్యర్థంగా చూస్తుంది లోకం. మూడడుగులు దాన మడగ టానికి వెళ్తే ముల్లోకాలకు అధిపతి పొట్టివాడు కావలసివచ్చింది.

157. పైన క్రింద పరమాత్మే ఉన్నాడు. అందుకనే మనకన్నా పైవారితో సహవాసం కలిగియుండాలి. మన కన్నా క్రిందివారిపై సానుభూతి కలిగి ప్రేమను పంచాలి. ఈ సుగుణము పైకి లేచిన తలను దించుతుంది. వంచిన తలను లేపుతుంది.

158. మూర్ఖత్వము జ్ఞానాన్ని స్వీక రించదు. దోషాలను చూపెడితే దూషిస్తుంది. ముఖాన ఉండే వికారాన్ని చూపిందని అద్దాన్ని పగులగొట్టే సామర్థ్యము మూర్ఖత్వానికే ఉంటుంది.

159. తప్పు చేయడం పెద్ద తప్పు కాదు. చేసిన తప్పును సరిదిద్దుకోలేక పోవడం ఘోరమైన తప్పు. ఒప్పు చేయకపోవడం తప్పు. అలా చేయ లేకపోగా మరో విధంగా కప్పిపుచ్చాలని యత్నించటం ఏనాడైనా ముప్పే.



160. యాచించడం జీవితంలో ప్రథమ కర్తవ్యం కాకూడదు. ఒకవేళ యాచించవలసి వస్తే అధముణ్ణి యాచించకూడదు. అధముడు అడిగినా ఇవ్వడు. ఇచ్చినా తిరిగి ఇచ్చే వరకు నిద్ర పోనివ్వడు. ఈలోగా నిందలు వేస్తాడు. నిజాలు దాచేస్తాడు. భుజాలపై ఎక్కి స్వారి చేస్తాడు. బాధించటంలో ఈ లోకాన అధముడే ప్రథముడు.

161. సకాలము నందు నాటిన బీజమే మొలకెత్తుతుంది. సమయాలు

నియమాలు ఎరిగి భాషించినపుడే వాక్కు అమృతతుల్యంగా ఉంటుంది.

**162.** అగ్ని పెద్దలకు ఉపకరిస్తుంది. శిశువులకు బాధ కలిగిస్తుంది. లక్ష్మి ధర్మాత్ములవద్ద ఉంటుంది. అలాగే దురాత్ముల వద్ద కూడా ఉంటుంది. ధర్మాత్ములకు మల్లెల పందిరియై ఉంటుంది. అధర్మపరులకు నల్లుల మంచమై ఉంటుంది. అధర్మపరులను ధనం ఆశ్రయించేది వారిని సుఖ పెట్టేందుకు కాదు; పరుగులెత్తించి దుఃఖ పెట్టేందుకే.



**163.** పరమాత్మ అడిగాడని మనం నైవేద్యం పెడుతున్నామా? అదంతా మన కొరకే మనం చేసుకుంటున్నాం. ఇతరులకు మనం చేసే సహాయం కూడా అలాంటిదే.

**164.** అందరూ తోడుగా ఉన్నట్లే ఉంటారు. కాని, జీవుడు ఎప్పుడూ ఒంటరివాడే. ఒక్కడే వచ్చి ఒక్కడుగా వెళ్ళేవాడే. చెట్టు మీద పక్షులకు పరస్పరం ఏర్పడే సంబంధాలు సూర్యోదయంతో తీరిపోతాయి. ఈ ప్రపంచంలో జీవులకు ఏర్పడే అనుబంధాలు మృత్యువుతో తీరిపోతాయి.

165. ఈ ప్రపంచంలో జరిగింది, జరుగుచున్నది, జరుగబోవునది ఏదైనను అదంతయు పరమాత్మ ఆజ్ఞకు లోబడియే ఉంది. దేహములన్నీ తోలు బొమ్మలే. మనస్సు లన్నీ కీలు బొమ్మలే. పరమాత్మ ఎటు కదిపితే అటు కదుల్తాయి.

166. ఎండొచ్చినా, వానొచ్చినా గొడుగు పైకే పోతుంది. సుఖమొచ్చినా, దుఃఖ మొచ్చినా సాధకుడు ప్రగతివైపే పయనించాలి. ఊర్ధ్వ గతియే ఉత్కృష్టము.



167. తుమ్మెద ఎటు ఎగిరినా, ఎక్కడ తిరిగినా పువ్వుపై వాలినపుడే నవ్వుతుంది. తనకు ఆకలి తీరేది, ఆనందం కలిగేది పువ్వు ఒడిలోనే. ఆ గుడిలోనే. భక్తులైన భ్రమరాలకు పరమాత్మ చరణారవిందము ఆధార స్థానమే కాదు; ఆనంద నిలయం కూడా.

168. గురువును వ్యక్తిగా చూచేవారు ఎన్నడూ శిష్యులు కాలేరు. గురువు వ్యక్తి కాదు. శక్తి. జీవన శక్తి. జీవికి శక్తి.

**169.** విలువైన కారును నీవు కొ వచ్చు. కానీ, ఆ కారును నడిపే డ్రైవరు మీద ఆధారపడి ఉన్నావు. ఇల్లు కట్టేవారి మీద, ఇంటిని కడిగేవారి మీద బ్రతికినపుడు ఆధారపడాలి. గుంట త్రవ్వేవాడి మీద, మట్టి నింపే వాడి మీద చచ్చినపుడు ఆధారపడాలి. ఈ ప్రపంచంలో పరమాత్మను విస్మ రించి పరులపై ఆధారపడి ఉండేవా రందరూ దీనులే.

**170.** పెరిగేది విరగక పోదు. విక సించింది వాడక మానదు. భవంతులు



కూలిపోతాయి. దేహాలు రాలిపో తాయి. జరిగేవి జరగక మానవు. జారి పోయేవాటిని పట్టుకొనే ప్రయత్నం కన్నా, దారిన పడి దరి చేరడమే ఉత్త మము.

**171.** ఆడు..... కాని అలసిపోకు. క్రీడించు.... కాని చిక్కిపోకు. గెలువు... కాని అది నీ శక్తి యని గర్వించకు. ఓడిపో...... కాని అది ప్రసాదమని భావించు. ఆటను గూర్చిన మాటను విన్నావా? బాటను దిద్దుకో! బ్రతుకు పాటను పాడుకో!

172. బావుల్లో నీళ్ళుంటాయి. మనుషులలో మనస్సు లుంటాయి. అన్ని బావులలోని నీరు ఒకే రుచిని అందించవు. అందరి మనసులు ఒకే సత్యమును ప్రవచించవు. నేలను బట్టే నీటి రుచి. గుణ భేదాల వల్లనే మనో భేదాలు.

173. పారే నీరు మలిన మెరుగదు. తిరిగే రాతికి పాచి పట్టదు. భక్తి ఓటమి నెరుగదు. భక్తుడు పతన మెరుగడు. నమ్మినవారు చెడలేదు. నమ్మని వారు బాగుపడలేదు.



174. మనం బాటసారులం. జీవన రాగము నాలపిస్తూ గమ్యాన్ని చేరిన పుడే బ్రతుకు ధన్యమవుతుంది. బాటను వీక్షిస్తూ ముందుకు నడవాలి. పాటను వినిపిస్తూ మున్ముందుకు సాగిపోవాలి. ఒంటరితనము బాధించదు. తుంటరితనము సుఖపెట్టదు. నీ జీవన శిల్పానికి నీవే శిల్పివి. బాధలు, బరువులు మెరుగులు దిద్దుతాయి.

175. మనసును తగిలించుకొని మానవుడ వయ్యావు. మనసును తొలగించుకొని మాధవుడ వవుతావు.

176. తేరును చూసి తీరును మార్చుకో. తేరులా మెల్లగా ముందుకు కదులుతూ ఉండు. కాని, మాధవుణ్ణి మోస్తున్నా ననే భావనను దూరం కానీయకు. ఇదియే తీరు. పనితీరు. యోగః కర్మసు కౌశలమ్.

177. సత్పురుషులు చరించినదే సన్మార్గము. ముందు నడిచి వెళ్ళిన ముక్త పురుషుల పాదముద్రలను దర్శిస్తూ సాగిపో. నీ బాటను ఇతరులకు ఆదర్శంగా నిలుపుతూ ముందుకు సాగిపో.



178. పగిలేది కుండ. వాడేది దండ. కుండను పగలకుండా ఆపగలమా? దండను వాడకుండా నిలపగలమా? చెండులా దొర్లిపోకు. కొండలా నిలిచి చూడు. మట్టి కుండపై మోహ మెందుకు? మలినదేహంపై మమత లెందుకు?

179. నావ తీరాన్ని చేరిందా! ఇక నావ మనది కాదు. నీరు మనకు లేదు. మనసు భగవంతునితో కలిసిందా? ఇక దేహము మనది కాదు. జగత్తు మనకు లేదు.

180. నీటికి దూరమై చేప బ్రతకలేదు. చేప ఊరేగేది ఉదకాన్ని ఉద్ధరించేందుకు కాదు. ఉదకానికి దూరమైతే తనకే ఉనికి మిగలదు. మనమూ అంతే. పరమాత్మ నాశ్రయించుకొని ఊరేగుతున్నాం. ఊడిపోతే, క్షణంలో అంతా వాడిపోతుంది.

181. బ్రతుకంతా ఎదురీతే కావచ్చు. జీవిత మంతా యెద బాధే ఉండొచ్చు. బాధలు పడినా, వ్యథలు మిగిలినా మంచికి ఎపుడూ మంచి రోజులే.



182. ఒక సుఖాన్ని వదలి మరొక సుఖాన్ని అన్వేషించటం - అనుభవించిన సుఖాన్నే మళ్ళీ మళ్ళీ అనుభవించటంలోనే ఈ సుఖాలు సుఖాలు కావని తేలిపోయింది.

183. లేని దానిని వదిలేది ఉండదు. ఉన్నదానిని పొందేది లేదు. లేకనే ఉన్నట్లు గోచరించేది భ్రాంతి. ఉన్నది ఉన్నట్లు తెలియుటే శాంతి. నీవు కానిది, నీకు లేనిది లేదు; లేదు; లేదు. ఇది వినుటయే నీకు చేదు. ఇది నీ స్వరూప లక్షణం కాదు.

184. పూలు వాడిపోతాయి. దారము వాడిపోదు. నామరూపాలన్నీ నశించి పోతాయి. చైతన్యము దారములాగా స్థిరంగా ఉంటుంది.

185. ధనం అన్నం పెడుతుంది; ఆకలి పుట్టించలేదు. కలిమి కలాన్ని కొని పెట్టగలదు; కవిత్వాన్ని కదిలించలేదు. సంపదలు అవసరాలను తీర్చవచ్చు. ఆవేదనలను తొలగించలేవు. ధనం దారిద్ర్యాన్ని తొలగించగలదేమో గాని ఐశ్వర్యాన్ని ప్రసాదించలేదు.



186. గాలము జలములో ఉంది. మీనమును ఆహ్వానించలేదు. మీనమే మోహంతో గాలాన్ని సమీపిం చింది. ఏం పొందిందో తెలియదు గాని ప్రాణాన్ని మాత్రం పోగొట్టుకుంది. జీవన ప్రవాహంలో ఏ వస్తువూ మనల్ని బాధించదు. ఏ వ్యక్తీ మనల్ని బంధించడు. అన్ని స్వయంకృతాలే. చిత్తములు వేసే చిందులే.

187. మార్పులేని బ్రతుకు ఏమిస్తుంది తీర్పు? కూర్పు నేర్చి, ఓర్పుతో బ్రతికితే అపుడే కనువిప్పు. ఆ తరువాత, నీవే ఒక వేలుపు.

188. శిక్షణకై బాట నెక్కిన నీకు రక్షణ తోడుగా ఉంది. అడుగులు మెల్లగా ముందుకు వేయి. పిడుగులు పడినా, మడుగులు ఎదురైనా వెనుకాడకు. వెను దిప్పకు. వెన్నుని దారిలో మన్ను కూడా వెన్నయే నని మరచిపోకు.

189. ఇదొక గారడీ ప్రపంచము. విషయ సుఖాలనే మతాబుల క్షణిక వెలుగులలో తైతక్కలాడకు. రాలే లోగా వెలిగే దెలాగో ఆలోచించు. కూలేలోగా పరమాత్మ బడిలో వాలే దెలాగో యోచించు.



190. తీపి పదార్థాలు రోగి ప్రాణాలను తోడేస్తుంటే, చేదు మందులు చేయూత నిచ్చి రక్షిస్తున్నాయి. ప్రాణాలు పోస్తున్నాయి. తీపిలో ఎంత చేదు? చేదులో ఎంత తీపి.

191. దేహాలన్నీ ఒకే రకమైన ఆహారాన్ని గ్రహించటం లేదు. దేహాలన్నీ శ్మశానంలో ఒకే రంగు గల బూడిదగ కనిపిస్తున్నాయి. నీవు ఏ మార్గంలో పయనించినా, గమ్యము చేరిననాడు అది అద్వైతమే. అదే విభూతి సుందరుని వైభవం.

**192.** బ్రతుకు నవ్వులాట కాదు. నవ్వుతూ ఆడే ఆట. బ్రతుకులో నవ్వ లేనివాడు నగుబాట్లకు గురి అవుతాడు. నవ్వలేని క్షణం మరణం. నవ్వుతూ బ్రతికే క్షణమే జీవనం.

**193.** బ్రతకడం మనిషికి చేత నయింది. కాని, బ్రతుకంటే ఏమిటో తెలియకుండా పోయింది. బ్రతక నేర్చిన సమాజంలో మనిషి క్షణక్షణానికి మరణిస్తాడు. బ్రతుకు నేర్పే సమాజం లో మనిషి అమృత స్వరూపు డవు తాడు.



**194.** ఈ ప్రపంచంలో ఎవరూ ఎవర్నీ మార్చాల్సిన అవసరం లేదు. జ్ఞాన ంతో, ప్రేమతో జీవించగలిగితే చాలు. కల్పవృక్షము క్రింద ప్రతి సంకల్పం ఫలించినట్లు, ఆశ్రితుల బ్రతుకులు అమృతమయ మవుతాయి.

**195.** దోషిని కారాగారంలో బంధిస్తారు. అది అతనికి శిక్ష. అబద్దాలు పలికే వాడికి శిక్ష ఏమిటి? అతని మాటల్ని సమాజంలో ఎవరూ నమ్మరు. అంతకు మించిన శిక్ష మనిషికి ఏముంది?

196. మనకు సంపద ఉండొచ్చు. అది తాత్కాలికంగా కొంతకాలం ఉంటుంది. ఎందుకని? రాక ముందు మన వద్ద లేదు. వచ్చినా ఒకనాడు ఉండబోదు. ఒకవేళ ఉండినా మనం ఉండక పోవచ్చు. "ఇవి నా కున్నాయి. కాని, ఇవి నావి కావు" అనే సత్యం మన స్సులో స్థిరపడిననాడే మనిషికి శాంతి.

197. అందరు అందరి కొరకు ఉన్నా రనే సందేశాన్ని అందరు అర్థం చేసు కోవాలి. అప్పుడే బుద్ధులు వికసిస్తాయి. బ్రతుకులు శోభిస్తాయి.



198. జ్ఞానికి జగత్తు లేనిది కాదు. జగత్తుగా లేనిది. ఉన్నట్లు ఉంది. ఉన్నా లేనట్లే ఉంది. రజ్జువులో సర్పం లాగ ఉంది. ఆకాశంలో నీలి వర్ణం లాగ ఉంది. ఛాయలాగ ఉంది. మాయలాగ ఉంది.

199. ఏది మనకున్నా అది మనది కాదని, మన కొరకు ఉన్నదని, అది కూడా ఎప్పుడూ ఉండదని, ఉన్నంత వరకు పరమాత్మ ప్రసాదంగా ఉన్నదని గ్రహించి, ప్రశాంత చిత్తులై జీవించు వివేకవంతులు మోక్షార్హులు.

**200.** జలం ఎరుగదు కులం. గాలి
ఎరుగదు గోత్రం. ఏ పెరట్లో విచ్చు
కున్నా మల్లెల సువాసన ఒకేలాగ
ఉంటుంది. ఎవరి నవ్వు వెనుకైనా
ఆహ్లాదమే ఉంటుంది.

**201.** తెలియక చేతులు కాల్చుకుంటే,
తెలిసి చికిత్స చేయించుకుంటున్నాం.
తెలియక అజ్ఞాన మార్గంలో పరిభ్ర
మించి ఉండవచ్చు. తెలిసి జ్ఞాన
రహదారుల్లో నడవడానికి నడుం బిగిం
చాలి. అప్పుడే ప్రగతి. సద్గతి.



**202.** సరోవరంలో చేప లున్నట్లు
సమాజంలో మహాత్ములు ఉంటారు.
చేపల కారణంగా సరోవరం నిర్మలంగా
ఉంటుంది. మహాత్ముల కారణంగా
మహిలో మహిమ శోభిస్తుంది.

**203.** అవరోధాలు లేకపోవటం అభి
వృద్ధి కాదు. అవరోధాల మధ్య అవగా
హనతో జీవించటము అభివృద్ధి. అవ
గాహన కుదిరితే బ్రతుకు కుదుట
పడుతుంది. అవగాహనను పెంచు
కోవటమే మనం చేయవలసిన కృషి.
ఆ తరువాత నిలిచేది భగవంతుని
కృప.

**204.** ఆడుకో. కాని, ఓడిపోతే అపజయమని భావించకు. ఓడిపోవటంలో నీవు ఏదీ పోగొట్టుకోలేదు. ఓటమి ఎందుకు కలిగిందో తెలుసుకున్నావు. ఇక నిన్ను ఎవరు ఓడించగలరు? ఇక, గెలుపు నీదే.

**205.** పవిత్రమైన జగదాలయంలో మనం పూజారులం. అన్నిటిని సమర్పించేందుకే మనం ఇక్కడ ఉన్నాం. సమర్పణలో మనకు లభించేది ప్రసాదము. అదే ప్రశాంతత. అదే పవిత్రత.



**206.** మస్తకాలు సిద్ధపడకపోతే పుస్తకాలు చేసేదంటూ ఏదీ ఉండదు. బుద్ధి శుద్ధి పడకపోతే బోధలు రుచించవు. రుచించినా ఫలితాలను ప్రసాదించవు.

**207.** మనకు ఏది జరిగితే మనం భరించలేమో దానిని ఇతరులు కూడా భరించలేరేమో! ఇతరులు మనపట్ల ఎలా ఉండాలని మనం కోరుకుంటున్నామో అలా మనం ఇతరుల పట్ల ప్రవర్తించాలి. ఇది ధర్మం. జయానికి మూలం. **"యతో ధర్మః తతో జయ".**

208. ఒకరు మనల్ని బాధించటానికి శత్రుత్వమే ఉండాల్సిన అవసరం లేదు. మురికి గుంటలకి మనకు శత్రుత్వ మేముంది? దోమలకు మనకు దోస్తీ ఏముంది? అలాగని శత్రుత్వం మాత్రం ఏముంది? అదే పనిగా కుడుతున్నాయి. వాటిని మనం అర్థం చేసుకోవాలి. అంతే. కొందరిని మనం అలాగే అర్థం చేసుకోవాలి.

209. తప్పులు చేస్తూ బ్రతుకు పెరగటం తప్పు కాదు. పెరిగే బ్రతుకు తప్పులను సరిదిద్దుకోలేకపోతే



బ్రతుకు బండబారిపోతుంది. భారమైపోతుంది. సుఖమనేది మనిషికి దూరమైపోతుంది.

210. అందరినీ సుఖపెట్టే శక్తి మనకు లేదు. అందుకనే, **"సర్వేజనాః సుఖినో భవన్తు"** అని అప్రమేయ వరదుడు, అనంతుడు అయిన పరమాత్మను ప్రార్థిస్తున్నాము.

211. గాయం కావడం అసహజం కాదు. గాయాన్ని మాన్పుకొనే ప్రయత్నం చేయకపోవటం సహజ మైతే మాత్రం పెద్ద ప్రమాదమే.

**212.** మన బాధలకు ఇతరులు కారణం అని గ్రహించటానికి జ్ఞానం అవసరం లేదు. మన బాధలకు మనమే కారణం అని గ్రహించటానికి జ్ఞానం కావాలి. ఇది అర్థమైతే మనం బాధపడకుండా జీవించగలం.

**213.** మనం తిరిగే కాకులం కాము. రాలే ఆకులం కాము. కదలలేని మాకులం కాము. జ్ఞానంతో చరించే మానవులం. దీనుల మనే అధైర్యం వద్దు. దీన బాంధవుడు ఉన్నా డనేదే ముద్దు.



**214.** నీవు లేనిదే మనస్సు లేదు. మనస్సు లేకపోయినా నీవు ఉంటావు. మనస్సు ఉండొచ్చు. నీవు మనస్సు కాదు. నీవు గాని మనస్సు నిన్నెలా బాధపెడుతుంది?

**215.** రాయి కదలదు. నీరు నిలవదు. ఉన్నచోటే ఉంటుంది రాయి. ఊరే గుతూ ఉంటుంది జలం. నీవు ద్రవి స్తేనే ఇతరులను స్పృశిస్తావు. ఇలా జీవించాలి అని తెలిపేందుకే కదిలే నీరు కదలని రాయిని స్పృశించి ముందుకు పోతుంది.

**216.** రాకుండా ఉండే జ్ఞానమూ లేదు. పోకుండా ఉండే అజ్ఞానమూ లేదు. మన ప్రయత్నమే ప్రధానం. ఆ తరువాతే ఏదైనా. ఇది అర్థమైన వారికే దైవ సహాయం.

**217.** ఇతరులు నిన్ను గూర్చి చేసే ఆలోచనలు వేరు. ఇతరులు నిన్ను గూర్చి అలా ఆలోచిస్తున్నారు, ఇలా ఆలోచిస్తున్నారు అని నీవు ఆలోచించే విధానం వేరు. ఇక్కడే ఆవేదనలు ఆరంభమవుతాయి. కష్టాలు కదుల్తాయి. కన్నీళ్ళు జారుతాయి. గుండెలు పగులుతాయి.



**218.** మెదడు దాచుకుంటుంది. మనస్సు సంపాదిస్తుంది. అందిన వాటిని మెదడు ఉంచుకోవచ్చు. లేదా, పారేసుకోవచ్చు. అందని వాటిని పట్టు కోవటం, తెచ్చుకోవటం మెదడుకి చేతకాదు. మనస్సుకే సాధ్యం.

**219.** నీవు ఆశించేది అంతం కలిగినదైతే దానిని పొంది సాధించే దుండదు. ఒకవేళ అది అనంతమే అయితే, అట్టి దానిని అర్థం చేసుకోవాలే గాని, కర్మ ద్వారా పొందాలనుకొంటే మాత్రం అది కుందేటి కొమ్మే అవుతుంది.

**220.** ఇతరుల ఆలోచనలతో కలిసి కొంతసేపు ఆలోచించటానికి మించిన సేవ ఈ ప్రపంచంలో మరొకటి లేదు. దీనిని అంగీకరించటానికి అనుభవ మొక్కటే సరిపోదు. సౌజన్యంతో కూడిన జీవితం కావాలి.

**221.** కళాయి లేని అద్దం కుళాయి లేని టాంకు వంటిది. అద్దానికి వెనుక కళాయి ఉండాలి. టాంకు ముందు కొళాయి ఉండాలి. నీకు మాత్రం, ముందు వెనుక భగంతుడే ఉండాలి. అప్పుడే బ్రతుకుకు సార్థకత ఏర్పడు తుంది.



**222.** సుఖపడాలని ప్రయత్నించినంత వరకు నీవు సుఖపడలేవు. నీవే సుఖ మని నీకు తెలిసినపుడే నీవు సుఖ పడతావు.

**223.** రుచు లెన్నున్నా రుచి చూచే నాలుక ఒక్కటే. భక్షింపబడేవి ఎన్న యినా భరించే కుక్షి ఒక్కటే. పదార్థా లెన్నయినా, అవి ప్రసాదించే శక్తి ఒక్కటే. అంకె లెన్నయినా వాటిలో ఉన్న దొక్కటే. అదే అద్వయం. అదే అద్వైతం. అదే అద్వితీయం. అదే అనంతం.

224. సముద్రంలో లవణ మున్న మాట నిజమే. కాని, ఆణిముత్యాలు లేవనుకోవటం సత్యం కాదు. పాల సముద్రంలోనే హాలాహలం. పలుకు నేర్చిన సమాజంలోనే కోలాహలం. ఇది అర్థం కాకపోతే అంతా చింతే. అర్థమైతే, బ్రతుకంతా నిశ్చింతే.

225. సమస్యలు కొత్తవి కావచ్చు. పరిష్కారం పాతదే. దారి తప్పటమే సమస్యలకు కారణం. చక్కని రాజ మార్గమే ఏకైక పరిష్కారం. ఇదే జ్ఞాన మార్గం.



226. పాముల్ని చూచి అందరు పరుగెత్తిపోతారు. కాని, శివుడు వాటినే ఆభరణాలుగా అలంకరించుకున్నాడు. ప్రపంచం ఎవరినైనా దూరం చేయ వచ్చు. పరమాత్మ అందరినీ దగ్గరకు చేర్చుకుంటాడు.

227. అవసరాలకు మించిన ఆస్తులు అంతర్యంలో ఒత్తిళ్ళను పెంచుతాయి. గందరగోళాన్ని సృష్టిస్తాయి. తూర్పులో పడమరను చూపిస్తాయి. ఆశలన్నీ చెడ్డవి కావు. పేరాశ లేవైనా మంచివి కావు.

228. నంది పశువైనా పశుపతిని ముందుంచుకొనిన భాగ్యానికి పూజ లందుకుంటోంది. సంసారాలు మోయటం అందరికీ ప్రీతి. శివుణ్ణి మోయటం నందికి ప్రీతి.

229. బాధలకు దూరం కావాలని ఆలోచిస్తాం. వాటిని దగ్గరకు తెచ్చు కున్నది మనమే అనే సత్యాన్ని గ్రహించము. పిలవకుంటే, అవి దూరంగానే ఉంటాయి. బాధలకన్నా వాటిని కొని తెచ్చుకొనే ఆలోచనా విధానమే చాలా భయంకరమైనది. ప్రమాదకరమైనది.



230. ధేనువు క్షీరము నిస్తుంది. తరువు ఫలముల నిస్తుంది. గురువు జ్ఞానము నిస్తాడు. దేవగురుడు బృహస్పతి. గురుదేవు డెప్పుడైనా సరస్వతే.

231. ఎత్తు ఎదిగే వరకు, పొత్తు కుదిరే వరకు "అమ్మా! ఎత్తుకో!" అని మొత్తుకోవడమే బిడ్డ పని. అదే ప్రార్థనల రూపంలో మన ముందున్న పని.

232. కర్కశాలు, కాఠిన్యాలు లేనివి కొనవసరం లేదు. అవి మనకు తెలియక పోతే చాలు. తేలికపడి ఉంటాం. హాయిగా తేలిపోతూ ఉంటాం.

233. సేవ చేసేది పరుల కోసం కాదు. మన కోసమే. ఈ సత్యం అర్థం కానంత వరకు సేవకు రూపం రాదు.

234. స్నేహితులు అవసరం లేదు. స్నేహ జీవనం అలవరచుకోవాలి. నది తన నీటిని కొందరికే పంచదు. ఎందరికైనా పంచుతుంది. కొందరికి పంచితే వాళ్ళే మనవాళ్ళు. అందరికి పంచితే ఎవరూ మనవాళ్ళు కారు. మనం అందరికీ సంబంధించిన వాళ్ళ మవుతాం. ఇది ఫలితా లాశించని మహోత్తమ కార్యం. ఒక్క మాటలో చెప్పాలంటే యజ్ఞ జీవనం.



235. గాలి వీస్తూ ఉంటుంది. మనకు చాలా హాయిగా ఉంటుంది. గాలి ఒక చోట నిలవదు. వచ్చిపోతూ ఉంటుంది. వచ్చిపోతే సమస్య లేదు. వచ్చి ఉంటేనే ఏదైనా సమస్య (జ్ఞానం తప్ప).

236. లేనివాళ్ళను ఎవ్వరూ పిలవరు. ఉన్నవాళ్ళే అయినా పిలిస్తే గాని రారు. పరమాత్మ ఉన్నవాడే. పిలిస్తే పలుకుతూ వచ్చేవాడే. పిలిచే సంస్కారమే ఇప్పుడు మన బుద్ధికి పట్టాలి. ఇది అభ్యర్థన కాదు. ప్రార్థన.

237. మోసం చేసి ధనార్జన చేయ వచ్చు. ప్రజల దృష్టిని ఆకర్షించే దుస్తుల్లో, భవంతులలో, వాహనాలలో కనిపించవచ్చు. కాని, చూచేవారి కళ్ళకు అవేవీ కనిపించవు. వీటన్నిటిలో మోసగాడు కులుకుతున్నాడు అనే చూస్తారు. ఇంతకు మించి మోసగానికి మరణ మేముంటుంది?

238. తెలిసో, తెలియకో మనం కోరుకున్నవే మన వద్ద ఉన్నాయి. కోరిన వన్నీ మనతో ఉండకపోవచ్చు. కాని, ఉన్నవి మాత్రం మనం కోరుకు న్నవే. శ్రమించి ఏరుకున్నవే.



239. ఆవు నుండి పాలే రావాలి. పేడ రాకూడదు అంటే వీలుపడదు. కర్మలు కూడా అలాగే ఉంటాయి. ఏ కర్మ చేసినా, అది పూర్ణంగా అర్థవం తంగా ఉంటుందని చెప్పలేము. కొంత అభ్యంతరంగా కూడా ఉం టుంది. సంబంధాలు కూడా ఇలాగే ఉంటాయి. ఏ సంబంధం లేకుండా, ఎవరితోను సంబంధం లేకుండా జీవించటం సాధ్యపడదు. కాని, సంబంధాలలో కేవలం సంతోషమే ఉంటుందని చెప్పలేము. విషాదం కూడా కలిసే ఉంటుంది.

240. తెచ్చుకున్న వాటిని తరిమితే పోవు. పోయే క్షణం వచ్చినపుడు పట్టుకున్నా నిలవవు. ఏడ్చినా వీడని నేస్తాలను నవ్వుతూ భరించటమే సుఖం. అక్కడే మనసుకు శాంతి.

241. తలపై బరువైన మూటల నుంచి నిద్ర పొమ్మంటే ఎవరికి సాధ్యం? మనస్సులో బరువులు నింపుకొని ధ్యానం చేయటం కూడా అంతే. బరువైన ధ్యానం బుద్ధిని తేలికపరచలేదు. ఖాళీ అయితేనే నిండేది. మనస్సు ఖాళీ అయితేనే ధ్యానం పండేది.



242. ప్రపంచంలో అసంతృప్తి నిచ్చే ఆయాసాలే గాని, సంతృప్తి నిచ్చే పాయసాలు లేవని మనస్సుకు తెలియాలి. ఆశ లుడిగిన మనస్సు, రాగద్వేషాలను రాల్చేసుకున్న మనస్సు సదా ధ్యానంలోనే ఉంటుంది.

243. కట్టెలోని అగ్ని కట్టెనే దహింపచేస్తుంది. ఎవరిలో చెడు ఉన్నా అది ఉన్నవారికే కీడు. అనవసరంగా దానిని గూర్చి చర్చించి, ఆ చెత్తను నెత్తి కెత్తుకొంటే గుండెకు భారమే గాని బుద్ధి తేలికపడదు.

**244.** జీవికి జీవన సమరం తప్పదు. అనివార్యాలను నివారించలేము. అవగాహనను చిగురింప చేసుకోవాలి. సమరం బాహ్యంలో సాగుతూనే ఉండాలి. సాధన ఆంతర్యంలో కొన సాగుతూనే ఉండాలి.

**245.** ఇచ్చేందుకు ఈ ప్రపంచానికి మనం ఏమి తెచ్చాం? ఇచ్చే చేతుల్ని తప్ప. అవి కూడా పరమాత్మ కృపతోనే చలిస్తున్నాయి. చేతులు పడిపోయిన వారిని చూచినపుడు ఈ సత్యం మనసుకు అర్థమవుతుంది.




**246.** ఇవ్వటములో ఇచ్చేవాడు, పుచ్చు కొనేవాడు మాత్రమే ఉంటారు. సమర్పణలో మరొక వ్యక్తి ప్రవేశిస్తాడు. అతడే భగవంతుడు. ఆయన ఇచ్చే వాడిలో కదుల్తూ కర్తృత్వాన్ని లేకుండా చేస్తాడు. పుచ్చుకొనేవాడిలో మెదుల్తూ కర్తృత్వాన్ని, భోక్తృత్వాన్ని లేకుండా చేస్తాడు.

**247.** మనకు ఆశ ఉంది; శక్తి లేదు. పరమాత్మకు అపార శక్తి ఉంది; ఆశ లేదు. మన ఆశ ఆయన పాదాల నాశ్రయిస్తే ఆయన శక్తి మన బుద్ధి నావరిస్తుంది.

## 248. వాన కురుస్తున్నా ఇంటిలో ఉన్న నీవు తడవవు. నీలో నీవు నీవుగా ఉంటేనే తృప్తి.

ఆత్మ బంధువులందరికి ఆహ్వానం ...ఆధ్యాత్మిక భక్తి తత్వ జ్ఞానంప్రచారం
ఈ **WEB SIGHTS** ద్వారా చేస్తున్నాము.....
**OUR VIDEOS,AUDIOS,e-BOOKS**
**FREE DOWNLOADALE WEB SIGHTS LINKS:**
**http://telugudevotionalswaranjali.blogspot.in**
స్వామి విద్యాప్రకాశానందుల వారి ప్రవచనముల **WEB SIGHT LINK:**
**http://gitamakarandam.blogspot.in**
స్వామి సుందర చైతన్యానందుల వారి ప్రవచనముల**WEB SIGHT LINK:**
**http://sundaravignanagrandalayam.blogspot.in**
**FOR HINDI BHAJANS, SANSKRIT SLOKAS**
**& ASHTAKAMS & CHANTS WEB SIGHT LINK:**
**http://hindudevotionalswaranjali.blogspot.in**
**OUR YOUTUBE VIDEO CHANNEL :**
**http://www.youtube.com/ysreddy94hyd**
**OUR PDF BOOKS CHANNEL :**
**http://www.scribd.com/ysreddy94hyd**
**OUR E-mail ID: ysreddy94hyd@gmail.com**
మీరు కూడా మీ వంతు ఆధ్యాత్మిక భక్తి తత్వ జ్ఞానంప్రచారాన్ని మీరు మన**WEB SIGHTS**
ను మీ ఫ్రెండ్స్ మరియు బంధువులకు పంపడం ద్వారా చేయగలరని ఆహ్వానిస్తున్నాము


భగవంతుడే సత్యము.
భగవంతుడే సర్వము. భగవదాను
భూతియే మన జీవిత లక్ష్యము. ప్రేమ ద్వారా
భగవానునితో ఐక్యమగుటయే జీవిత గమ్యము.

త్యాగజీవనమే ప్రేమమార్గము. అది సురక్షిత మార్గము.
సన్నిహిత మార్గము. భేదభావాలనే కఠినమైన రాళ్ళు తగలవు.
అజ్ఞాన కంటకాలు గుచ్చుకోవు.

నడచి చూడు, చూసి నడువు. నడతయే నాణ్యతను
కల్పిస్తుంది. నాణ్యతయే నవ్యతను అందిస్తుంది.
బ్రతుకు నవ్యంగా సాగుతుంది. సత్యదేవుని
సమీపిస్తుంది.

స్వామి సుందర చైతన్యానంద